# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-08-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **పోలవరం ప్రాజెక్టు పనులను శరవేగంగా పూర్తి చేసి, వచ్చే ఏడాదిలోనే ప్రాజెక్టును ప్రారంభిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా మూలపేట పోర్టు నిర్మాణం త్వరలోనే పూర్తవుతుందని కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.**

3. **రాష్ట్రంలో డంపింగ్ యార్డుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు.**

4. **రైతులకు వ్యవసాయ పనులు సులభతరం చేసేందుకు రాష్ట్రంలో యాంత్రీకరణకు ఊతమిస్తామని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు.**

==========================

రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పనులను శరవేగంగా పూర్తి చేసి, వచ్చే ఏడాదిలోనే ప్రాజెక్టును ప్రారంభిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటిని వచ్చే నెల 2వ తేదీకి అనకాపల్లి వరకూ తీసుకెళ్లి జల హారతి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే ఏడాది విశాఖపట్నం వరకూ గోదావరి జలాలు తరలిస్తామన్నారు. బీసీ రిజర్వేషన్లపై స్పందిస్తూ, బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం ఒక చట్టపరమైన రక్షణగా పేర్కొన్నారు. ఇచ్చిన హామీల్ని నిలబెట్టుకుంటే ప్రజల నుంచి సహజంగానే సానుకూల స్పందన వస్తుందన్నారు.

-------------------------

శ్రీకాకుళం జిల్లాలోని మూలపేట పోర్టు నిర్మాణం త్వరలోనే పూర్తవుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు. పోర్టుకు అనుసంధానంగా జిల్లాలో అనేక పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు మార్గం సుగమం అవుతోందని చెప్పారు. శ్రీకాకుళంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. బీచ్ శాండ్ మైనింగ్ అంశంపై ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్తోందని వెల్లడించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నేరడి ప్రాజెక్టు కార్యరూపం దాల్చడం హర్షణీయమని తెలిపారు. ప్రాజెక్టు పూర్తయితే సమీప ప్రాంతాల ప్రజలకు సాగు, తాగు నీటి సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు. గత రెండేళ్లలో ఎంత

వేగంతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామే అంత కంటే ఎక్కువ వేగంతో భవిష్యత్తులో పని చేస్తామని పేర్కొంటూ..

వాయిస్...30 సెకన్లు

-----------------------------

రైతులకు వ్యవసాయ పనులు సులభతరం చేసేందుకు రాష్ట్రంలో యాంత్రీకరణకు ఊతమిస్తామని తెలంగాణా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాదులోని రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ, అనుబంధ శాఖలపై ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాయితీ నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేస్తామన్నారు. తక్కువ ధరతో నాణ్యమైన యంత్రాలు, పరికరాలు పంపిణీ చేసే కంపెనీల జాబితాను రూపొందించాలని సూచించారు. అనంతరం యాంత్రీకరణ పథకంలో సరసమైన ధరలకు ఇచ్చే పరికరాలను ఖరారు చేశారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 31న మార్కాపురం జిల్లా వెలిగొండలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామిలతో కలిసి నిన్న పరిశీలించారు. మార్కాపురం జిల్లాలోని గంటావానిపల్లి వద్ద క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి జలహారతి సమర్పించే ప్రాంతం, పైలాన్ వద్ద చేపడుతున్న పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి నిమ్మల రామానాయుడు పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్...30 సెకన్లు

-----------------------------

ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నగర శివారు ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి ఎద్దడి సమస్యను వెంటనే పరిష్కరించాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఇతర అధికారులతో కేంద్ర మంత్రి నిన్న సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు తాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి సమస్యలు ఉన్న ప్రాంతాలను ప్రాధాన్యతా క్రమంలో గుర్తించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

-----------------------------

రాష్ట్రంలో డంపింగ్ యార్డుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. డంపింగ్ యార్డ్ రహిత మున్సిపాలిటీల రూపకల్పనే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అమరావతిలోని సిఆర్డిఏ కార్యాలయంలో ఈ అంశంపై మంత్రి నిన్న సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా ఆరు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అక్టోబర్ 2వ తేదీ నుంచి మున్సిపాలిటీల్లో ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను తప్పనిసరిగా సంబంధిత వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లకు తరలించాలని మంత్రి స్పష్టం చేశారు.

---------------------------

తెలుగు భాషను పరిరక్షించి.. ఆ భాష గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియ జేసే ఉద్దేశ్యంతో ఈరోజు తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తున్నారు. తెలుగు వ్యావహారిక భాషోద్యమ కర్త గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. వాడుక భాషకు పట్టం కట్టిన గిడుగు రామమూర్తి పంతులు శ్రీకాకుళం జిల్లా శ్రీముఖలింగం పర్వతాల పేటలో 1863 వ సంవత్సరం ఆగస్టు 29వ తేదీన జన్మించారు. గ్రాంథిక భాషలో వున్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చి... నిత్య వ్యవహారిక భాషలో వున్న చక్కదనాన్ని, సౌలభ్యాన్ని తెలియజెప్పారు. బహుభాషావేత్త గిడుగు వెంకట రామమూర్తి పంతులు 1940వ సంవత్సరం జనవరి 22 వ తేదీన తన 76వ ఏట తుది శ్వాస విడిచారు.

---------------------------

ఉత్తరాంధ్రకు సాగు తాగునీటి అవసరాలు తీర్చే పోలవరం ఎడమ కాలువ ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ గనులు భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులకు సూచించారు. పాయకరావుపేటలో అధికారులతో సమీక్ష సమావేశన్ని హోమ్ మంత్రి వంగలపూడి అనితతో కలిసి ఆయన నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. పోలవరం ఎడమ కాలువను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చే నెల 2వ తేదీన ప్రారంభించనున్న నేపథ్యంలో జలహారతి కార్యక్రమ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 137వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

పశ్చిమ బెంగాల్-ఉత్తర ఒడిశా తీరాలపై ఈరోజు అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్ర ప్రదేశ్, యానంలలో దిగువ ట్రోపో ఆవరణములో పశ్చిమ, వాయువ్య దిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ వెల్లడించారు. ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలలో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంటూ..

వాయిస్.. 20 సెకన్లు

మరోవైపు తెలంగాణలో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================